క్లుప్తంగా

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉంగుటూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉంగుటూరు ఎస్‌ఐ గోవిందు సూచించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అపరచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా, సీవీవీ, ఓటీపీ నంబర్లను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. హెచ్‌ఎం అనిత, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలి



కంకిపాడు: చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందేలా చూడాలని అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు కోరారు. కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ కె.బి.సుకన్యను మంగళవారం ఆయన కలిశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యనభ్యసించే చిన్నారులకు పౌష్టికాహారం విషయంలో లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో తరుచూగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కోరారు. పౌష్టికాహారం పంపిణీలో లోటుపాట్లు సరిచేయించి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసి, వసతులను కల్పించాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆర్థిక సమస్యలతో కాలేజీ ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐ సాయం అందజేశారు. బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన గండి రామారావు తనయుడు జీవన్ కిరణ్ ఏలూరులోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న తరుణంలో కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు తనయుడు, ఎన్‌ఆర్‌ఐ విశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన విశ్వనాథ్ జీవన్ కిరణ్‌కు రూ.27 వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తండ్రి గండి రామారావుకు హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ-2 ఎన్.లక్ష్మీనరసింహమూర్తి, ఎన్‌ఆర్‌ఐ విశ్వనాథ్ తల్లిదండ్రులు చింతల వెంకటశివ అప్పారావు, రమాదేవి చేతుల మీదుగా అందజేశారు.

బాలికపై గుర్తు తెలియని వ్యక్తి చాకుతో దాడి



ఉంగుటూరు: ఓ మైనర్ బాలికపై గుర్తుతెలియని వ్యక్తి చాకుతో దాడి చేసిన సంఘటన తేలప్రోలు గ్రామంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలిక(16) సోమవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో మసీదు సెంటర్‌లో కిరాణా షాపునకు వెళ్లి ఇంటికి వెళ్తోంది. ఇంటికి వెళ్లే దారిలో మలుపు వద్ద ఓ యువకుడు ముఖానికి మాస్క్ ధరించి వచ్చి ఆమెపై చాకుతో దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో దుండగుడు అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో ఆ బాలిక చేతికి, మెడపై గాయలయ్యాయి. గాయపడిన బాలికను గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న ఆత్కూరు పోలీసులు, జిల్లా అడిషనల్ ఎస్పీ, గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్ సీఐ సత్యనారాయణ, సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్కూరు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు మార్కెట్‌లో సిండికేటుగాళ్లు

- దిగజారుతున్న పసుపు కొమ్ముల ధరలు
- మార్కెట్ మాయాజాలంతో నష్టపోతున్న రైతులు
- నిల్వ చేసిన కొమ్ములను విక్రయించేందుకు తంటాలు



దావులూరులో పసుపు కొమ్ములను శుభ్రం చేస్తున్న కూలీలు (ఫైల్)

కంకిపాడు: రోజు రోజుకూ దిగజారుతున్న పచ్చబంగారం(పసుపు) ధర రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. సిండికేట్ మాయాజాలమే పసుపు కొమ్ముల ధర దిగజారడానికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిండికెట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారు. ఫలితంగా పసుపు కొమ్ముల ధర పడిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మంచి ధర కోసం నిల్వ చేసుకున్న పసుపు పంటను విక్రయించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ధర పడిపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

1,077.64 హెక్టార్లలో పసుపు సాగు

వాణిజ్య పంటల్లో పచ్చ బంగారంగా పిలిచే పసుపు పంటను జిల్లా వ్యాప్తంగా మెట్ట ప్రాంతాలు, లంక భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏటా 1,077.64 హెక్టార్లలో పసుపు సాగు జరుగుతోంది. గత సీజన్‌లోనూ ఇదే విస్తీర్ణంలో సాగు జరిగింది. కడప, మైదుకూరు, సేలం, ప్రగతి, స్థానిక విత్తన రకాలను రైతులు సాగుకు ఎంచుకుని సాగుచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో పసుపు పంటను తవ్వి పసుపు కొమ్ములను ఉడకబెట్టి, ఎండబెట్టిన తరువాత మార్కెట్‌కు తరలించారు. ఒక్కో రైతుకు సాగు పూర్తయ్యి పంట చేతికి అందే నాటికి ఎకరాకు రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడులు అయ్యాయి. కౌలురైతులు ఎకరాకు మూడు పుట్లు (పుట్టు అంటే 225 కిలోలు) చెల్లించారు.

లభ్యత లేకున్నా పెరగని ధర

గతేడాది పంట చేతికి వచ్చిన తరుణంలో భారీ వర్షాలు కారణంగా దెబ్బతింది. ఉడకబెట్టి, పూర్తిగా ఎండిన పసుపు కొమ్ములు వర్షంలో తడవటంతో బహిరంగ మార్కెట్‌లో ధర పతనమైంది. క్వింటా ధర కనీసం రూ.5 వేలు కూడా దాటని పరిస్థితి. దీంతో వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర అందేలా చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో పసుపు పంట చేతికి వచ్చింది. ఎకరాకు 20 క్వింటాళ్ల నుంచి 22 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. పంట చేతికి వచ్చాక మార్కెట్‌లో క్వింటా పసుపు ధర రూ.15,500 నుంచి రూ.16 వేల వరకూ పలికింది. మంచి ధర లభించటంతో రైతులు తమ వద్ద ఉన్న పంటను విక్రయించుకున్నారు. ఇంకా ధర పెరుగుతుందనే సంకేతాలు ఉండటంతో మరి కొందరు రైతులు పంటను గోదాముల్లో భద్రపర్చుకున్నారు. మార్కెట్ లెక్కల ప్రకారం ఇంకా రైతుల వద్ద 35 శాతం వరకూ పంట నిల్వ ఉన్నట్లు అంచనా. అయితే కొద్ది రోజులుగా పసుపు పంట ధర రోజురోజుకూ పతనమవుతోంది. ప్రస్తుత సీజన్‌లో జూన్, జూలై నెలల్లో పసుపు కొమ్ములు క్వింటా ధర రూ.14 వేల నుంచి రూ.14,500 వరకు పలికింది. ఆగస్టులో ఆ ధర క్వింటా రూ.12,500లకు పడిపోయింది. ప్రస్తుతం క్వింటా పసుపు ధర రూ.11,100 పలుకుతోంది. పడిపోతున్న ధరను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర పతనం ఎక్కడికి దారితీస్తుందో? చేతిలో నిల్వ ఉంచిన పంటను ఎలా విక్రయించాలో? పాలుపోక అన్నదాతలు కలవరపడుతున్నారు. ఈ సీజన్‌లో పసుపు సాగు చేపట్టిన రైతులు సాగు ఖర్చులు పెరిగి ఆర్థిక భారంతో అవస్థ పడుతున్నారు. ఒక్క విత్తనం కోసమే ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ ఖర్చు చేశారు. సాగు పూర్తయ్యే సరికి ఎకరాకు రూ.1.80 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేసుకుంటున్నారు. ఈ సెప్టెంబర్‌లో సంభవించిన వరదలు, భారీ వర్షాలకు పంట దెబ్బతినటంతో దిగుబడులు కూడా ఆశించిన మేరకు వచ్చే పరిస్థితి లేదన్న ఆందోళన ఓ వైపు ఉంది. మరో వైపు మార్కెట్‌లో పసుపు లభ్యత లేకున్నా ధర పెరగకపోవటంతో సాగు కష్టంగా సాగిస్తున్నారు.

మార్కెట్ ఒడిదొడుకులు వ్యాపారుల పనే

మార్కెట్‌లో ఒడిదొడుకులు అన్నీ వ్యాపారుల మాయాజాలమే అన్న ప్రచారం రైతుల్లో ఉంది. రైతుల వద్ద ఉన్న పంటను తక్కువ ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులు ధరలను నియంత్రిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దుగ్గిరాల, నిజామాబాద్ ప్రాంతాలతో పాటుగా పలు ప్రాంతాల్లో ఉన్న వ్యాపారులు జిల్లాలో కొనుగోళ్లు సాగిస్తున్నారు. ధర తగ్గుతుండటంతో రైతులు పంటను విక్రయించేందుకు వెనుకాడుతున్నారు. అయితే ఇంకా ధర పడిపోవచ్చనే భయాన్ని రైతుల్లో నింపి సొమ్ము చేసుకోవాలని వ్యాపారులు చూస్తున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కానూరులో అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

పెనమలూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ఎవరూ భయపడరాదని సీఐడీ పోలీసు అధికారులు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం సీఐడీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీలు డి.ప్రసాద్, జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. నేడు సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయటానికి అనేక మార్గాలు ఎంచుకుంటున్నారన్నారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభం వస్తుందని ఎరవేస్తున్నారని చెప్పారు. అలాగే క్రిప్టో కరెన్సీ, ఎక్కువ లైక్‌లు కొడితే డబ్బు వస్తుందని, ఇలా వేరువేరు పంధాలతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ సెక్యూరిటీ కంటే ముందుగా సైబర్ క్రైమ్‌పై అవగాహన ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌లపై ఇటీవల కాలంలో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి అరెస్టులు ఉండవని తెలిపారు. మహిళలపై వేధింపులు అరికట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐడీ అధికారులు రాజేష్, కవిత, శ్రీమూర్తి, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



గుమ్మడి నాగేంద్ర క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



ముస్తాబాదలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



హనుమాన్‌జంక్షన్‌లో..



కంకిపాడులో పూజలు చేస్తున్న భక్తులు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో నాగులచవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేసరపల్లి శివారు గుమ్మడి నాగేంద్ర క్షేత్రంలోని శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు, గుడ్లు, పలు రకాల నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయం, దావాజిగూడెంలోని శివాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న శ్రీనాగేంద్రస్వామివారి ఆలయంలో నాగులచవితి వేడుకలు ఘనంగా చేశారు. ఆలయంలో ఉదయం 5 నుంచి 11 గంటల వరకు రుద్రాభిషేకం చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కొండపై ఉన్న నాగేంద్రస్వామివారి ఆలయంలో భక్తులు పాలు పోశారు. పెనమలూరు, పోరంకి, కానూరు, పెదపులిపాక, వణుకూరు తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకలు నిర్వహించారు.

కంకిపాడులో..

కంకిపాడు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని నాగేంద్రస్వామి ఆలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, గుడ్లు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. కంకిపాడు లాకురోడ్డు, ఆంజనేయస్వామి ఆలయం, నాగేంద్రస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, మంచినీరు చెరువు కట్ట, చినకంచిలో భక్తులు పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. పి.నైనవరం గ్రామంలో శ్రీశివనాగేంద్రస్వామి దేవస్థానంలో పూజలు చేశారు.

జంక్షన్‌లో పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని నాగేంద్రస్వామి దేవస్థానం వద్ద విశేష పూజలు నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని నాగలక్ష్మి అనే మహిళ ఇంట్లో నాలుగేళ్ల క్రితం పాముల పుట్ట ఏర్పడటంతో అప్పటి నుంచి నిత్య పూజలు చేస్తున్నారు.

రూరల్‌లో..

గన్నవరంరూరల్: గ్రామాల్లోని పుట్టల వద్ద పూజలు చేసి నాగేంద్రుడికి పాలు పోశారు. దీపాలు వెలిగించి భక్తిని చాటారు. ముస్తాబాదలో శ్రీ రామలింగేశ్వరస్వామిని సన్నిధిలో కొలువై ఉన్న శ్రీ సుబ్రమణ్యస్వామి పుట్ట వద్ద వేలాది మంది భక్తులు పూజలు పోశారు.

దాళ్వాకు వరి విత్తనాలు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వరరావు

పాతపాడు(విజయవాడరూరల్): దాళ్వా సీజనులో వరిసాగు చేసేందుకు వరి విత్తనాలు సరఫరా చేయాలని రైతులు వ్యవసాయశాఖ అధికారులను కోరారు. పాతపాడు శివారు అప్పారావుపేట గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులు 1121 రకం వరి విత్తనం సరఫరా చేస్తే నారుమళ్లు పోసుకుంటామన్నారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్లో వరి కోతలకు అవసరమైన వరి కోత యంత్ర పరికరాలు సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు అందజేయాలని కోరారు. వరి కోతలకు బయట నుంచి వచ్చే వ్యక్తులు ఎకరానికి 2,800 రూపాయలను తీసుకొంటున్నారని చెప్పారు.

విత్తనాల సరఫరాకు చర్యలు..

దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుమిత్ర గ్రూపుల ద్వారా వరి కోత యంత్రాలను అందించే అవకాశం ఉందన్నారు. వరి విత్తనాలను బయట వ్యక్తుల నుంచి కొనుగోలు చేయరాదని, ఆ విత్తనాలు మొలకెత్తకుంటే రైతులు నష్టపోతారని చెప్పారు. దాళ్వాకు అవసరమైన విత్తనాలను ఈ నెల 10వ తేదీలోగా ప్రభుత్వ సంస్థ నుంచి సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తామని ఏఓ బి.రంగనాథ్‌బాబు తెలిపారు. జైకిసాన్ ఎత్తిపోతల పథకం చైర్మన్ కొండేటి ప్రభాకర్‌రావు, సభ్యుడు మేడగాని శ్రీనివాసరావు, రైతులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి మంగారెడ్డి, అవుతు శ్రీనివాసరెడ్డి, వాకాడ రాము, రంగారావు, కృష్ణ, వ్యవసాయ సహాయకులు అక్షయ్, రైతులు పాల్గొన్నారు. దుర్గారావు అనే రైతు వరిపొలాన్ని అధికారులు పరిశీలించారు.

రాయితీలతో సాగుకు ప్రోత్సాహం



అధికారులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త అనూరాధ



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి హరిచంద్

కంకిపాడు: ప్రభుత్వం అందించే రాయితీలతో సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని నీతి ఆయోగ్ శాస్త్రవేత్త అనూరాధ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులతో కంకిపాడు రైతు సేవ కేంద్రంలో అపరాల సాగుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనూరాధ మాట్లాడుతూ దాళ్వా పంట కాలంలో పప్పు దినుసులు సాగులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగు ఖర్చులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఏడీఏ సునీల్, ఏఓ పీఎం కిరణ్, రైతులు పాల్గొన్నారు.

రాయితీలు వినియోగించుకోవాలి

గన్నవరంరూరల్: ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని మండల హార్టీకల్చర్ అధికారి ఈ.హరిచంద్ రైతాంగానికి సూచించారు. సూరంపల్లిలో ఉద్యాన రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్‌తో వ్యవసాయం చేసే 5 ఎకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాల కంటే పైగా ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు ఉచితంగా అందిస్తామని చెప్పారు. కొత్తగా మామిడి, జామ, బొప్పాయి, టిష్యూ కల్చర్ అరటి పంటల సాగుకు రాయితీ వస్తుందన్నారు. వీహెచ్‌ఏ వి.దీక్షా, టి.శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కంకిపాడు: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి బి.ప్రశాంతి సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో భాగమైన జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో పునాదిపాడు, ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలల్లో బాలల హక్కులపై అవగాహనా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమరవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రశాంతి మాట్లాడుతూ.. దత్తత, తాత్కాలిక దత్తతపై అవగాహన కల్పించుకోవాలన్నారు. బాలికల సంరక్షణ, ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఔట్ రిచ్ ప్రతినిధి బి.శ్యామల, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి సూరిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని 104 సిబ్బంది విజ్ఞప్తి

గన్నవరం: న్యాయబద్ధమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని 104 సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక గ్రామ సచివాలయం -2లో వైద్యాధికారి డాక్టర్ సృజనకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 104 స్టాఫ్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.సుబ్బారావు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా ప్రభుత్వం 104 సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 సేవలను నిర్వహించాలని కోరారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీవో నంబర్ 7 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. అరబిందో యాజమాన్యం, సిబ్బంది నుంచి వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ డ్రైవర్లు 74 మందికి శ్లాబ్ అమలు చేయాలని కోరారు.

డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లకు కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ఉద్యోగులకు యాజమాన్యం రావాల్సిన ఇతర బకాయిలు కూడా చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 104 సిబ్బంది ఉమా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో విలువైన భూమి కాజేయటానికి నకిలీ అగ్రిమెంట్‌తో డాక్యుమెంట్ సృష్టించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం .. విజయవాడ గౌతమినగర్‌కు చెందిన కె.సుప్రజ, ఇద్దరు సోదరీమణులకు కలిపి కానూరు పరిధిలో ఎకరం స్థలం ఉంది. అయితే ఫిర్యాది సుప్రజకు ఎకరంలో 23 సెంట్లు వాటా ఉంది. తాడిగడప పద్మానగర్‌కు చెందిన చలసాని రాము, కానూరుకు చెందిన డాక్యుమెంట్ రైటర్ కె.వెంకటరమణతో కలిసి సుప్రజ స్థలం కాజేయటానికి నకిలీ అగ్రిమెంట్ సృష్టించారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్ట్

గన్నవరం: మద్యం అనధికారికంగా విక్రయిస్తున్న ముగ్గురు బెల్టుషాపు నిర్వాహకులను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య మద్యం విక్రయాలు జరుపుతున్నట్లుగా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఇలియాజ్ నేతృత్వంలో పోలీసులు దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపు నిర్వాహకులు బాణావతు సైదా, పామర్తి కనకదుర్గను అదుపులోకి తీసుకుని 74 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇరువురిని గన్నవరం ఎక్సైజ్ అధికారులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. అదే విధంగా ఉంగుటూరు మండలం తేలప్రోలులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ అల్లూరయ్య తెలిపారు. అతని వద్ద ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎఫ్ఐఆర్ వెంటనే నమోదు చేయాలి

ఉంగుటూరు: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో త్వరితగతిన ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతి పత్రాన్ని ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ గోవిందుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల కేసుల విషయంలో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగించాలని కోరారు. నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని, నాయకులు చిట్టి బాబు, జీవన్, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు డాక్టర్ బి.వి.రావు జయంతి

కంకిపాడు: పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బి.వి.రావు జయంతిని మండలంలోని కుందేరు గ్రామంలో బుధవారం నిర్వహించనున్నట్లు కుందేరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్వీఎస్ రంగారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రీయ గోకుల్‌మిషన్ నిధులతో పశుగణనాభివృద్ధి సంస్థ సహకారంతో గ్రామంలోని పశువైద్యశాల ప్రాంగణంలో బి.వి.రావు జయంతి, పశు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. పశుపోషకులు, రైతులు బి.వి.రావు జయంతి, పశువైద్య శిబిరాల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.